బడ్జెట్ ఎస్సీ, ఎస్టీ, బీసీ బడుగు, బలహీన వర్గాలను మోసం చేసేలా ఉన్నది. దళిత బంధుకు బదులుగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తామన్న అంబేద్కర్ అభయహస్తం ఊసేలేదు. దళితబంధుకు రాంరాం చెప్పేసినట్టేనా? కాంగ్రెస్ అంటేనే దళితులను నమ్మించి వెన్నుపోటు పొడిచే పార్టీ. 4 కోట్ల మందిని మోసం చేసిన బడ్జెట్ ఇది. రేవంత్ చేతకాని పాలనకు నిలువుటద్దం. - కొప్పుల ఈశ్వర్, మాజీ మంత్రి

TELANGANA BUDGET- 2025-26

ఎగవేత గ్యారెంటీ

₹ 11,405cr

బడ్జెట్‌లో బీసీ సంక్షేమానికి కేటాయించిన నిధులివి

పింఛన్లు పెంచలే

బడ్జెట్‌లో అదనపు కేటాయింపుల్లేవు

చేయూతకు రూ.14,861 కోట్లు

నిరుడు కూడా ఇంతే కేటాయింపు

10 లక్షల మంది కొత్తవారికి మొండిచేయ్యి

హైదరాబాద్, మార్చి 19 (నమస్తే తెలంగాణ): ఆసరా పింఛన్‌దారులకు ఈ ఏడాది కూడా రేవంత్‌రెడ్డి సర్కారు మొండిచెయ్యి చూపింది. పింఛన్ల మొత్తం పెంపునకు మంగళం పాడింది. తాము అధికారంలోకి వస్తే రూ.2 వేల పింఛన్‌ను రూ.4 వేలకు, రూ.4 వేల దివ్యాంగుల పింఛన్‌ను రూ.6 వేలకు పెంచుతామని కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ప్రకటించింది. ఎన్నికల ముందు ప్రతిసభలోనూ రేవంత్‌రెడ్డి ఇదే విషయం నొక్కి చెప్పారు. కానీ, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 15 నెలలైనా పింఛన్ల పెంపు ఊసెత్తడం లేదు. చేయూత పథకానికి సర్కారు ఈ బడ్జెట్‌లో రూ.14,861 కోట్లు మాత్రమే కేటాయించింది. గత 2024-25 బడ్జెట్‌లోనూ ఇంతే మొత్తం కేటాయించింది. ఇప్పుడు రూపాయి కూడా అదనంగా పెంచలేదు. కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు పింఛన్లు పెంచితే సుమారు రూ.27,000 కోట్లు అవసరం. కానీ, సర్కారు మాత్రం పాత పద్దునే కేటాయించింది. మరోవైపు 10 లక్షల మంది కొత్త పింఛనుదారులకు ఈ బడ్జెట్‌లో కేటాయింపులు చేయలేదు.

నిరుడు- ఇప్పుడు బడ్జెట్‌లో నిధుల కేటాయింపు

2024-25 చేయూత (పింఛన్లు)	2025-26 చేయూత (పింఛన్లు)
రూ.14,861 కోట్లు	రూ.14,861 కోట్లు

2 లక్షల ఉద్యోగాలు ఉత్తముచ్చటే!

ఉద్యోగాల కల్పన పేరిట ఊదరగొట్టిన కాంగ్రెస్ పార్టీ

అటకెక్కిన జాబ్ క్యాలెండర్, 30వేల పోస్టులతో సరి

జీతాల కోసం వార్షిక బడ్జెట్‌లో నిధులు కేటాయించలే

సర్కారుకు ఉద్యోగాలు ఇచ్చే ఉద్దేశం లేదు: నిరుద్యోగులు

హైదరాబాద్, మార్చి 19 (నమస్తే తెలంగాణ): '' మన పిల్లలకు మంచి కోచింగ్ ఇప్పియ్యండి, ప్రిపేర్ చేయండి, ఏం కావాల్నో సమకూర్చండి, బ్యాక్‌ల్యాగ్ పోస్టులెందుకుండాలి? ఫారిన్ పంపించేందుకు ఏర్పాట్లు చేయండి'' ఇది బుధవారం అసెంబ్లీలో తనతో సమావేశమైన మాదిగ సమాజికవర్గం నేతలతో సీఎం రేవంత్‌రెడ్డి మాటలు. సీఎం మాటలు ఇలా ఉంటే.. బడ్జెట్ ఇందుకు పూర్తి విరుద్ధంగా ఉంది. బడ్జెట్‌లో రూపాయి ఇవ్వకుండా కొత్త ఉద్యోగాలను ఎలా భర్తీచేస్తారని నిరుద్యోగుల నుంచి ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి.

ఉద్యోగులకు జీతాలెట్లిచ్చేది?

జాబ్ క్యాలెండర్‌కు చట్టబద్ధత, 2 లక్షల ఉద్యోగాలు. నిరుద్యోగ భృతి అంటూ ఊదరగొట్టిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నదనే విమర్శలు ఎదుర్కొంటున్నారు. సర్కారు కొలువుల భర్తీ విషయంలో ఆఖరుకు రిక్తహస్తమే మిగిలిచ్చిందని నిరుద్యోగులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఇప్పుడున్న ఉద్యోగులకే జీతాలివ్వలేకపోతున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వివిధ వేదికలపై చేతులెత్తేస్తున్నారు. రిజర్వ్ బ్యాంక్ నుంచి అప్పులు

తీసుకురానిదే జీతాలివ్వలేకపోతున్నామని చెప్పున్నారు. కొత్త ఉద్యోగాల భర్తీకి బడ్జెట్‌లో నయాపైసా కేటాయించలేదు. కొత్త ఉద్యోగాల భర్తీకి ఏటా బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి. కానీ ఈ బడ్జెట్‌లో వీటి ప్రస్తావనే చేయలేదు. అంటే కొత్త కొలువుల భర్తీ కథ కంచికి చేరినట్లేనని నిరుద్యోగులు ఆరోపిస్తున్నారు. కొత్త ఉద్యోగాల భర్తీని పూర్తిగా పక్కనపెట్టేశారా? అంటూ ప్రశ్నిస్తున్నారు.

ఇచ్చినయెన్ని? ఇవ్వాల్సినవెన్ని?

కాంగ్రెస్ 15 నెలల పాలన కాలంలో 57, 946 ఉద్యోగాలను భర్తీచేసినట్టు ప్రభుత్వం బడ్జెట్ ప్రసంగంలో తెలిపింది. వాటిలో కేసీఆర్ హయాంలో చేపట్టినవే దాదాపు 45 వేల ఉద్యోగాలున్నాయి. తాము అధికారంలోకి వస్తే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీచేస్తామని కాంగ్రెస్ ఎన్నికల వేల హామీనిచ్చింది. అంటే ఇప్పటివరకు ఇచ్చిన 57వేల ఉద్యోగాలను తీసేస్తే, 2024- 25 ఆర్థిక సంవత్సరంలో 1.43లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలి. కానీ రానున్న ఆర్థిక సంవత్సరంలో 30వేల పోస్టులు భర్తీచేస్తామని బడ్జెట్‌లో సర్కారు ప్రకటించింది. ఇవి కూడా విలేజ్ లెవల్ ఆఫీసర్ (వీఎల్‌వో), వీఆర్‌వో, అంగన్‌వాడీల్లోని ఉద్యోగాలే. అంగన్‌వాడీల్లో 14,236 ఉద్యోగాలు, వీఎల్‌వో, వీఆర్‌వో ఉద్యోగాలు మరో 15వేల వరకు భర్తీచేయనున్నట్టు సమాచారం. గతంలో అసెంబ్లీలో విడుదల చేసిన జాబ్ క్యాలెండర్ బోగస్ క్యాలెండర్ అని, కాంగ్రెస్ నయవంచక కాంగ్రెస్ అని నిరుద్యోగులు విమర్శలు గుప్పిస్తున్నారు.

కొండెక్కిన కొలువుల హామీ

కాంగ్రెస్ హయాంలో భర్తీ అయిన ఉద్యోగాలు 57, 946	ఈ మొత్తంలో కేసీఆర్ హయాంలో నోటిఫికేషన్లు 45 వేలు ఉద్యోగాలు
ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీ 2 లక్షల ఉద్యోగాలు	ప్రభుత్వ లెక్కల ప్రకారం భర్తీ అయిన ఉద్యోగాలు 57వేలు
ఇంకా భర్తీ చేయాల్సినవి 1.43లక్షల ఉద్యోగాలు	తాజా బడ్జెట్‌లో ఇచ్చిన హామీ 30 వేల ఉద్యోగాలు
అంగన్‌వాడీలలో ఉద్యోగాలు 14,236	
వీఎల్‌వో, వీఆర్‌వో ఉద్యోగాలు 15 వేలు	ఉద్యోగుల సగటు జీతం రూ.30వేలు(ఏడాదికి రూ. 3.6లక్షలు)



2లక్షల ఉద్యోగాలు ఇస్తే అవసరమయ్యే నిధులు 7,200 కోట్లు

ఇదీ సర్కారు ఉద్దేశం!

ఉద్యోగాల భర్తీపై గొప్పలు చెప్పున్న సీఎం రేవంత్‌రెడ్డి ఆచరణలో మాత్రం ఆ దిశగా అడుగులు వేయడం లేదు. ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్ వంటి మాటలు చెప్తున్నప్పటికీ వాస్తవంగా లెక్కలు చూస్తే ప్రభుత్వ చిత్తశుద్ధిపై సందేహాలు తలెత్తుతున్నాయి. ఉదాహరణకు ఒక ఉద్యోగం భర్తీచేస్తే ఇచ్చే సగటు వేతనం రూ.30వేలు అనుకుంటే ఏడాదికి సర్కారు రూ. 3.6లక్షలు వేతనం రూపంలో అందించాలి. రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తే ఏడాదికి రూ.7,200కోట్లు బడ్జెట్‌లో కేటాయించాలి. కానీ రూ. 7,200 కోట్లను జీతాల కోసం ప్రభుత్వం కేటాయించలేదు. దీన్ని బట్టి చూస్తే ప్రభుత్వానికి ఉద్యోగాలు ఇచ్చే ఉద్దేశం ఉందో లేదో అర్థం చేసుకోవచ్చని నిరుద్యోగులు చెప్తున్నారు.

KAMAREDDY BC DECLARATION

బీసీల వాటా 3.7 శాతమే!

బీసీ సబ్‌ప్లాన్ అమలుకు సర్కార్ మంగళం

రూ.20వేల కోట్ల హామీని విస్మరించిన వైనం

ప్రస్తుత కేటాయింపులు రూ.11,405 కోట్లే

కాటగలిసిన కామారెడ్డి డిక్లరేషన్

హైదరాబాద్, మార్చి19 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ సర్కార్ బీసీ వర్గాలపై వివక్షను మరోసారి బయటపెట్టుకున్నది. తాజాగా ప్రకటించిన రాష్ట్ర బడ్జెట్‌లో బీసీలకు కేవలం 3.7% నిధులనే కేటాయించి ఆ వర్గాల పట్ల తన నిర్లక్ష్యాన్ని నిరూపించుకున్నది. బీసీ సబ్‌ప్లాన్ అమలు హామీని మరోసారి తుంగలో తొక్కింది. కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు కామారెడ్డి వేదికగా బీసీ డిక్లరేషన్‌ను ప్రకటించింది. కులగణన నిర్వహిస్తామని, బీసీలకూ సబ్‌ప్లాన్ అమలు చేస్తామని, బడ్జెట్‌లో ఏటా రూ.20 వేల కోట్ల బడ్జెట్‌ను కేటాయిస్తూ ఐదేండ్లలో రూ.లక్ష కోట్లను బీసీల అభ్యున్నతికి ఖర్చు చేస్తామని హామీ ఇచ్చింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక నిరుటి బడ్జెట్‌లో సబ్‌ప్లాన్‌ను ప్రవేశపెట్టనే లేదు. కులగణన నిర్వహించడంతో పాటు, బీసీల రిజర్వేషన్ వాటాను 42 శాతానికి పెంచుతూ చట్టం చేయడంతో ఈ సారైనా సబ్‌ప్లాన్ ప్రవేశపెడతారని బీసీలు ఎంతగానో ఆశించారు. కానీ కాంగ్రెస్ సర్కారు మాత్రం యథావిధిగా బడ్జెట్‌లో బీసీలకు మళ్లీ మొండిచెయ్యి చూపింది. రాష్ట్ర బడ్జెట్ 3,04,965 కోట్లలో కేవలం నామమాత్రంగా 3.7% అంటే రూ.11,405 కోట్లనే కేటాయించింది. 17% ఉన్న ఎస్సీలకు రూ.40 వేల కోట్లు, 10% ఉన్న ఎస్టీలకు రూ.17 వేల కోట్లను కేటాయించింది. 56% జనాభా ఉన్న బీసీలకు మాత్రం 3.7% నిధులనే కేటాయించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రవచనాలు ఎక్కువ.. పైసలు తక్కువ

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

బడ్జెట్‌లో ప్రవచనాలు ఎక్కువ.. పైసలు తక్కువ ఉన్నాయని ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. గత ప్రభుత్వం చేసిన అప్పులతో రాష్ట్రం దివాలా తీసిందని కాంగ్రెస్ నేతలు చెప్తున్నారని, అదంతా అబద్ధమని చెప్పారు. కేసీఆర్ 4 లక్షల 37 వేల కోట్ల అప్పు చేసినట్టు బడ్జెట్‌లో చెప్పారని.. సీఎం, కాంగ్రెస్ నేతలు రూ.7 లక్షల కోట్లుగా ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.

అంచనాలన్నీ అవాస్తవాలే..

దేశపతి శ్రీనివాస్, ఎమ్మెల్సీ

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అంచనాలన్నీ అవాస్తవాలేనని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ ఆరోపించారు. ఆరు గ్యారెంటీల మీద హడావుడి చేశారని, బడ్జెట్‌లో ఆరు గ్యారెంటీల ఊసే లేదని తెలిపారు. ఇది దివాలాకోరు, దగాకోరు బడ్జెట్‌గా అభివర్ణించారు. సర్కార్ ఏ ఒక్క గ్యారెంటీని అమలుచేయలేదని విమర్శించారు.

బీసీలను దగాచేసే బడ్జెట్

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎల్ రమణ

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అరకొర కేటాయింపులతో ప్రజలను వంచించిందని ఎమ్మెల్సీ ఎల్ రమణ విమర్శించారు. 420 హామీలు, ఆరు గ్యారంటీలు ఇచ్చి అనేక సభల్లో ఊదరగొట్టారే తప్పా, ఒరగబెట్టిందేమీ లేదని విమర్శించారు. ఈ బడ్జెట్ చేతగాని పాలనకు నిదర్శనమని పేర్కొన్నారు.

రైతాంగాన్ని మోసం చేసే బడ్జెట్

ఎమ్మెల్సీ శేరి సుభాశ్‌రెడ్డి

అమలు కానీ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. బడ్జెట్‌లో ఆరు గ్యారెంటీల ఊసే లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ శేరి సుభాశ్‌రెడ్డి విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రాష్ట్ర రైతాంగాన్ని మోసం చేసేలా ఉన్నదని ఆరోపించారు.

అన్ని వర్గాలను వంచించిన బడ్జెట్

ఎమ్మెల్సీ తాతా మధు

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాలను వంచించేలా ఉన్నదని ఎమ్మెల్సీ తాతా మధు విమర్శించారు. ఎన్నికల ముందు యువతకు ఇచ్చిన ఉద్యోగాల నియామకం హామీ ప్రస్తావన లేదని మండిపడ్డారు. బడ్జెట్‌లో 420 హామీల అమలుపై మాట్లాడలేదని ధ్వజమెత్తారు.

పాలనా వైఫల్యానికి నిదర్శనం

ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్.. ప్రభుత్వ పాలనా వైఫల్యానికి నిదర్శనం అని ఎమ్మెల్సీ కోటిరెడ్డి విమర్శించారు. హామీలను అమలుకు బడ్జెట్‌లో కేటాయింపులు లేవని మండిపడ్డారు. తుమ్మిడిహెట్టి పనుల కోసం పైసా కేటాయించలేదని పేర్కొన్నారు.

ఎన్నికల హామీలను నెరవేర్చని కేటాయింపులు

ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన బడ్జెట్‌లో కేటాయింపులు ఎన్నికల హామీలను నెరవేర్చేలా లేవని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అభిప్రాయపడ్డారు. భూముల విక్రయం, మద్యం ద్వారా నిధులు సమీకరించాలని భావించడం సమంజసం కాదని పేర్కొన్నారు.

పొంతన లేని బడ్జెట్

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు.. కాంగ్రెస్ ఇచ్చిన హామీలకు పొంతన లేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ విమర్శించారు. ప్రాజెక్టుల కోసం నిధుల కేటాయింపులు తక్కువగా ఉందని పేర్కొన్నారు. ఆరు గ్యారెంటీల అమలుకు అవసరమైన నిధులు కేటాయించలేదని మండిపడ్డారు.

ఉత్పత్తి, ఉత్పాదకతలకు ప్రాధాన్యం లేదు

తెలంగాణ రైతు సంఘం

బడ్జెట్‌లో వ్యవసాయం, దాని అనుబంధరంగాల ఉత్పత్తి, ఉత్పాదకతలతోపాటు ఉద్యానరంగ అభివృద్ధికి కేటాయింపులు జరగలేదని తెలంగాణ రైతు సంఘం ఆరోపించింది. ఈ బడ్జెట్‌ను చూస్తే రుణమాఫీ కాని రైతులకు ఇక మాఫీ అయ్యే అవకాశం లేనట్టు కనిపిస్తున్నదని పేర్కొంది.

పెన్షనర్లు, ఉద్యోగుల ఊసే లేదు

పెన్షనర్ల అసోసియేషన్

బడ్జెట్‌లో పెన్షనర్లు, ఉద్యోగుస్తుల ఊసే లేకపోవడం శోచనీయమని పెన్షనర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఏ రాజేంద్రబాబు, ప్రధాన కార్యదర్శి ఎంవీ నరసింగరావు, ఆర్థిక కార్యదర్శి బీ నర్సయ్య ఒక ప్రకటనలో విచారం వ్యక్తం చేశారు. పెన్షనర్ల గురించి ఒక్కమాట మాట్లడకపోవడం విడ్డూరంగా ఉందని చెప్పారు.

ఎస్సీ నిధులపై అంకెల గారడీ

బడ్జెట్‌లో రూ.40,232 కోట్లు కేటాయించినట్టు గొప్పలు

సర్కార్ అసలు కేటాయించిన నిధులు రూ.26,615 కోట్లే

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులపైనా నిజాలు దాచిన ప్రభుత్వం

నిరుడు ఖర్చు చేయని నిధుల సంగతేంటని ఎస్సీ, ఎస్టీల ప్రశ్న

చేవెళ్ల ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్

హైదరాబాద్, మార్చి19 (నమస్తే తెలంగాణ): పేరు గొప్ప ఊరు దిబ్బ అన్నట్టుగా ఉంది కాంగ్రెస్ సర్కారు ప్రవేశపెట్టిన బడ్జెట్. 2017లో అప్పటి కేసీఆర్ సర్కారు తీసుకొచ్చిన చట్టం ప్రకారం ఒక సంవత్సరం మిగిలిన సబ్‌ప్లాన్ నిధులు ఆటోమేటిక్‌గానే మరో ఏడాదికి బదిలీ అవుతాయి. ఆ విషయాన్ని దాచిపెట్టి ఈ ఏడాది భారీగా నిధులను కేటాయిస్తున్నామని ప్రభుత్వం చెప్తున్నది. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతిపై ప్రత్యేక దృష్టి సారించారు. తెలంగాణ షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల ప్రత్యేక అభివృద్ధి చట్టం 2017ను ప్రవేశపెట్టింది. ప్రతీ ఆర్థిక సంవత్సరం పద్దు వ్యయంలో జనాభా దామాషా ప్రకారం ఎస్సీ, ఎస్టీలకు నిధులను కేటాయించారు. ఏదైనా ఆర్థిక సంవత్సరంలో ఉపయోగించని నిధులను ఆ తర్వాతి ఆర్థిక సంవత్సరంలోనే వినియోగించుకునేలా పరిహారం రూపంలో నిబంధనను చేర్చారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం 2025-26 ఆర్థిక సంవత్సరంలో మొత్తం ప్రగతి పద్దు వ్యయంలో రూ.1,74,710.69 కోట్లలో ఎస్సీ జనాభాకు అనుగుణంగా 15.45 శాతం నిధులను కేటాయించాల్సి ఉంది. కానీ ప్రభుత్వం 23.01శాతం నిధులు అంటే రూ.40,232 కోట్లను కేటాయిస్తున్నట్టు చెప్తున్నది. అదేవిధంగా ఎస్టీలకు సంబంధించి 9.8 శాతం అంటే రూ.17,169 కోట్లను పొందుపరించింది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఖర్చు చేయకుండా మిగిలిపోయిన ఎస్సీలకు చెందిన 13,617 కోట్లు, ఎస్టీలకు చెందిన 1,317 కోట్లను కూడా కేటాయిస్తున్నామని బడ్జెట్‌లో ప్రకటించినా ఆ మేరకు నిధులను పొందుపరచలేదు. బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నప్పటికీ ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధుల్లో ప్రత్యేకంగా చూపలేదు. ప్రస్తుతం కేటాయించిన ఎస్సీ సబ్‌ప్లాన్ నిధుల్లోనే వాటిని కూడా కలిపారా? లేదా అనేది కూడా స్పష్టం చేయలేదు. గతంలో మిగిలిపోయిన నిధులను కలిపినట్లయితే ఈ బడ్జెట్‌లో వాస్తవంగా ఎస్సీ సబ్‌ప్లాన్ కింద కేటాయించింది 26,615 కోట్లుగానే భావించాల్సి ఉంటుంది. అంటే అప్పుడు ప్రభుత్వం కేటాయించింది 15.23 శాతం నిధులను మాత్రమే. సబ్‌ప్లాన్ కింద కేటాయించాల్సిన 15.45శాతం కంటే తక్కువే.

గతేడాది నిధుల జాడేది?

2024-25 బడ్జెట్‌లో ఎస్సీ స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్ కింద ప్రభుత్వం రూ.33,127 కోట్లు కేటాయించింది. డిసెంబర్ నెలాఖరు నాటికి రూ.9,824 కోట్లు మాత్రమే ఖర్చు చేసింది. ఇంకా రూ. 23,303కోట్లు మిగిలిపోయాయి. ఎస్టీ స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్‌కు రూ.17,056 కోట్లు కేటాయించగా, డిసెంబర్ నెలాఖరు నాటికి రూ.6,766 కోట్లు ఖర్చు చేసింది. రూ.10,299 కోట్లు మిగిలిపోయాయి. ఆ మిగిలిన నిధుల సంగతిని మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్‌లో వెల్లడించలేదు.

'ఎస్సీ'లపైనే గురుకుల భారం

ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ పేరిట ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అన్ని గురుకులాలను కలిపి ఒకే సముదాయంలో ఏర్పాటు చేస్తామని చెప్పింది. ఇప్పటికే 58 గురుకుల భవనాలను 11,600కోట్లను మంజూరు చేసింది. ఆ నిధులన్నింటినీ ఒక్క ఎస్సీశాఖ ద్వారా, ఎస్సీ సబ్‌ప్లాన్ నుంచే ఖర్చు చేయనుంది. ఈ మేరకు తాజా బడ్జెట్‌లో యంగ్ ఇండియా గురుకుల భవనాల నిర్మాణానికి రూ.2400కోట్లను కేటాయింపులు చేసింది.

అంబేద్కర్ కొటేషన్లు.. దళితబంధుకు తూట్లు

- ఎస్సీ డిక్లరేషన్ హామీకి మంగళం
- అంబేద్కర్ అభయహస్తం ద్వారా రూ.12 లక్షలు ఇస్తామని హామీ
- నామమాత్రపు కేటాయింపులు
- తాజా బడ్జెట్‌లో రూ.1000 కోట్లే

హైదరాబాద్, మార్చి19 (నమస్తే తెలంగాణ): బడ్జెట్ ప్రసంగం ఆద్యంతం అంబేద్కర్ కొటేషన్లను వల్లేవేసిన ప్రభుత్వం కేటాయింపుల్లో మాత్రం ఆ స్ఫూర్తిని చూపలేదు. చేవెళ్ల ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌ను తుంగలో తొక్కింది. అంబేద్కర్ అభయహస్తం ద్వారా రూ.12 లక్షలు అందిస్తామని చెప్పి, ఇప్పుడు అందుకు విరుద్ధంగా దళితబంధు పథకం నిధుల్లో కోత విధించింది. దళిత బంధు పథకాన్ని మాజీ సీఎం కేసీఆర్ రూపకల్పన చేసి, అమలు చేసిన విషయం తెలిసిందే. ఎలాంటి షరతులు లేకుండా, బ్యాంకు లింకేజీ లేకుండా నిరుపేద దళిత కుటుంబాలకు ఏకమొత్తంగా రూ.10 లక్షల నగదును గత బీఆర్ఎస్ సర్కారు అందించింది. తొలి విడతలో రాష్ట్రవ్యాప్తంగా 44 వేల కుటుంబాలకు ఆర్థిక సాయాన్ని అందజేయగా, అందుకు రూ.4,400 కోట్లను వెచ్చించింది. ఆ పథకానికి 2023-24 బడ్జెట్‌లోనూ భారీగా నిధులను కేటాయించారు. నియోజకవర్గానికి 1500 చొప్పున రాష్ట్రవ్యాప్తంగా హుజురాబాద్ మినహాయించి 118 నియోజకవర్గాల్లో మొత్తంగా 17,700 కుటుంబాలకు దళితబంధు పథకం ద్వారా ఆర్థిక సాయాన్ని అందజేయాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తాము అధికారంలోకి వస్తే దళితబంధును కొనసాగిస్తామని, అంబేద్కర్ అభయహస్తం పేరిట ఒక్కో దళిత కుటుంబానికి రూ.12 లక్షలు అందిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. చేవెళ్లలో నిర్వహించిన ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ సభలో ఈ మేరకు కాంగ్రెస్ ప్రకటించింది. అయితే బడ్జెట్‌లో ఆ పథకం ఊసెత్తలేదు. అంబేద్కర్ అభయహస్తం పథకం ఏమో కానీ, ఉన్న దళిత బంధు నిధుల్లోనే కోత విధించింది. దళిత బంధు పథకానికి గత బడ్జెట్‌లో అరకొరగా రూ.2 వేల కోట్లను కేటాయించగా, ప్రస్తుత బడ్జెట్‌లో రూ.1000 కోట్లను మాత్రమే పొందుపరిచింది. ఇదిలా ఉంటే ఆ వెయ్యి కోట్లలోనూ దాదాపు రూ.500 కోట్లు బకాయిలకే పోనున్నాయి. దీంతో ఉన్న దళితబంధుతో పాటు, అంబేద్కర్ అభయహస్తం పథకం కూడా ఉత్త ముచ్చటగానే మారింది.

మునుగుడే రియల్టీ

మొదటిపేజీ తరువాయి...

నేలచూపు చూడటంతో తొలుత పార్లమెంటు ఎన్నికల ప్రభావమని సర్కారు సర్దిచెప్పింది. అయితే, క్షేత్రస్థాయిలోని వాస్తవాలతోపాటు వివిధ సర్వేలు సైతం చేదునిజాన్ని వెల్లడించినా పాలకుల్లో మార్పు రావడం లేదనేందుకు తాజా బడ్జెట్ కేటాయింపులే నిదర్శనం. మహా నగరంలో మౌలిక వసతుల కల్పనకు గత బడ్జెట్‌లోని అంకెలను ఈసారీ పునరావృతం చేయడం మినహా నగరాభివృద్ధిని పరుగులు పెట్టిస్తామనే భరోసాను కల్పించలేకపోయారు.

కేసీఆర్ హయాంలో పరుగులు

దేశంలోని మెట్రో నగరాలతో పోల్చుకుంటే హైదరాబాద్‌లో రియల్‌ఎస్టేట్, నిర్మాణ రంగాల్లో వృద్ధి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నంతకాలం ఒక మోస్తరుగానే ఉండేది. ముంబై, బెంగళూరు, పుణె, ఢిల్లీ వంటి నగరాలు ఒకదానితో ఒకటి పోటీ పడేవి. కానీ, 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడి, కేసీఆర్ పాలనాపగ్గాలు స్వీకరించడంతో హైదరాబాద్‌లో మౌలిక వసతుల కల్పన ప్రారంభమైంది. కేసీఆర్

ప్రభుత్వం తీసుకున్న ప్రత్యేక చర్యలతో ఐటీ రంగంలో ఎగుమతుల విలువ రూ.59 వేల కోట్ల నుంచి రూ.2.7 లక్షల కోట్లకు పెరగడంతోపాటు టెకీల సంఖ్య మూడు లక్షల నుంచి పది లక్షలకు చేరింది. దీనికితోడు క్రమంగా నగరంతోపాటు శివారు ప్రాంతాలకు మౌలిక వసతుల విస్తరణ, రవాణా వ్యవస్థ బలోపేతం కావడంతో జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడులు భారీగా తరలివచ్చాయి. తద్వారా ఆఫీస్‌స్పేస్‌తోపాటు రియల్‌ఎస్టేట్, నిర్మాణ రంగంలో పెట్టుబడులు గణనీయంగా పెరిగేందుకు దోహదపడింది. పదుల సంఖ్యలో ఫ్లైఓవర్లు, నగరం నలుమూలలా విశాలమైన లింకు రోడ్లు, జనాభా అవసరాలకు తగ్గట్టుగా పుష్కలమైన తాగునీటి సరఫరా, 24 గంటల కరెంటుతోపాటు కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన మానవీయ కార్యక్రమాలతో హైదరాబాద్ మహానగరం రియల్ ఎస్టేట్, నిర్మాణరంగాల్లో దేశంలోని ఇతర మెట్రో నగరాలను వెనక్కి నెట్టి వృద్ధిని నమోదు చేసింది.

ఏడాదిగా శూన్యం... మరో ఏడాదీ అంధకారమే!

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహా నగరంలో మౌలిక వసతులకు సంబంధించి ఒక్కటంటే ఒక్క కొత్త ప్రాజెక్టు కూడా మొదలు కాకపోవడం వాస్తవ పరిస్థితికి అద్దం పడుతున్నది. కేసీఆర్ ప్రభుత్వం మొదలుపెట్టిన ఎయిర్‌పోర్టు మెట్రోను రద్దు చేయడం, గతంలోని ప్రణాళికలన్నింటినీ చెల్లాచెదురు చేసి కొత్త పేర్లతో తిరిగి వాటిని చేపట్టేందుకు మళ్లీ ప్రతిపాదనలు తయారుచేయడంతో అధికార యంత్రాంగంలోనూ అయోమయానికి దారితీసింది. దీనికితోడు అత్యంత కీలకమైన ప్రతికూల పరిణామంగా హైడ్రాను తెరపైకి తెచ్చిన రేవంత్ ప్రభుత్వం ఇబ్బడిముబ్బడిగా నిరుపేదల ఇండ్లను కూల్చివేయడంతో రియల్‌ఎస్టేట్, నిర్మాణ రంగం తల్లడిల్లింది. చివరకు బిల్డర్లు ఆత్మహత్య చేసుకునే విషమ పరిస్థితులు రావడంతోపాటు హైడ్రా మూలంగా బిల్డర్లకు తాము రుణాలు ఇవ్వలేమని బ్యాంకులు చేతులెత్తేయడంతో సమాజంలోకి ఎలాంటి సంకేతాలు పోయాయో అర్థం చేసుకోవచ్చు. గత బడ్జెట్‌లో మౌలిక వసతుల కల్పనకు కేటాయించిన నిధుల్లో పావు వంతు కూడా విడుదల చేయని కాంగ్రెస్ ప్రభుత్వం... తాజా బడ్జెట్‌లోనూ మౌలిక వసతులకు పెద్దగా ప్రాధాన్యం ఇవ్వలేదు. మెట్రో విస్తరణ, ఎలివేటెడ్ కారిడార్‌లాంటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించకపోవడంతో రానున్న ఏడాదిలోనూ మౌలిక వసతుల కల్పన పెరగడం ప్రశ్నార్థకంగా మారింది. మరోవైపు, ప్రభుత్వం అక్రమ నిర్మాణాలంటూ బుల్డోజర్లతో విరుచుకుపడుతున్న హైడ్రాకు బడ్జెట్‌లో ర